క్లుప్తంగా

అంబేడ్కర్ విగ్రహానికి వినతి



విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న కార్మికులు

సిరిసిల్లటౌన్: ఆర్టీసీ కార్మికుల న్యాయమైన కోర్కెలు ప్రభుత్వం వెంటనే తీర్చాలని సీపీఐ కార్యదర్శి పంతం రవి కోరారు. ఆర్టీసీ కార్మికులతో పాటుగా ఆదివారం సిరిసిల్లలోని అంబేద్కర్ విగ్రహానికి వారి సమస్యలపై వినతిపత్రాన్ని అందించి మాట్లాడారు. ఆర్టీసీ ట్రేడ్ యూనియన్లపై నిషేధం ఎత్తివేయాలని, కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ప్రజావసరాల కోసం బస్‌లను పెంచాలని, కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సామల మల్లేశం, మంచికట్ల రమేశ్, మంత్రి చంద్రన్న, చింతకింది భాను పాల్గొన్నారు.

బేకరీపై అధికారుల దాడులు



తనిఖీ చేస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్

రుద్రంగి: 'కూల్ కేక్‌లో బొద్దింక..' అనే శీర్షికతో ఆదివారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఫుడ్ సేఫిటీ అధికారులు స్పందించారు. కూల్ కేకులో బొద్దింకలు వచ్చిన శ్రీ గణేశ బేకరిపై అధికారుల దాడులు చేసి, బేకరిలోని ఆహార పదార్థాల సాంపుల్స్ సేకరించి టెస్టులకు ల్యాబ్‌కు పంపారు. అలాగే పలు బేకరీలు, కిరాణ షాపులలో తనిఖీలు నిర్వహించారు. ప్రజలకు నాణ్యమైన వస్తువులు, ఆహార పదార్థాలను విక్రయించాలని ఆదేశించారు.

బాధితులను ఆదుకుంటాం



పరిశీలిస్తున్న లక్ష్మీనర్సింహారావు

కోనరావుపేట: వర్షాల కారణంగా నష్టపోయిన రైతులను, ప్రజలను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని చల్మెడ ఆస్పత్రి చైర్మన్ చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండలంలోని మామిడిపల్లిలో వర్షాలకు ఇసుక, మట్టితో నిండిపోయిన పంటలను పరిశీలించి, వర్షబాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భారీ వర్షాల కారణంగా గతంలో ఎన్నడూ లేనివిధంగా నష్టం వాటిల్లిందన్నారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం తరఫున ఆదుకునేందుకు మంత్రి కేటీఆర్‌తో మాట్లాడుతామన్నారు.

సమ్మెలో కార్మికులు.. రోగాలతో జనం

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం
కంపుకొడుతున్న కాలనీలు
రోగాలబారిన పడుతున్న ప్రజలు
రోగులతో ఆస్పత్రులు కిటకిట
పట్టించుకోని అధికారులు

ఎల్లారెడ్డిపేట: పంచాయతీ కార్మికుల నిరవధిక సమ్మె ప్రభావం ఆలస్యంగానైనా పల్లెల్లో కనిపిస్తోంది. ముఖ్యంగా మేజర్ గ్రామపంచాయతీలు, పంచాయతీల్లో పరిస్థితి మరీ దారుణంగా మారింది. వార్డులు, కాలనీల్లో చెత్తాచెదారం పేరుకుపోయి, వర్షంతో మురిగి కంపు కొడుతున్నాయి. దీంతో ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా మారినా పట్టించుకున్న వారు లేరు. పేరుకుపోయిన చెత్త ఎత్తేందుకు, మురుగునీటి కాలువలు శుభ్రం చేసేందుకు ఎవరు లేకపోవడంతో పరిస్థితి ఇప్పుడిప్పుడే అదుపు తప్పుతున్నట్లు కనిపిస్తోంది. కొన్ని పంచాయతీల్లో చెత్తను ఎత్తేందుకు స్వయంగా సర్పంచులే రంగంలోకి దిగడం, కొన్ని గ్రామాల్లో ప్రైవేట్ వ్యక్తులతో పారిశుధ్య పనులు చేయించేందుకు అధికారులు ప్రయత్నించినా, పారిశుధ్య కార్మికులు అడుకుంటున్నారు. దీంతో చెత్తకుప్పలు ఎక్కడికక్కడ పేరుకుపోతున్నాయి. డ్రెయినేజీలు మురుగుతో నిండి కంపుకొడుతున్నాయి. పల్లెల్లో దుర్గంధం ఆవరిస్తోంది. ఫలితంగా ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. జ్వరాలతో బాధపడుతున్న జనం చికిత్స కోసం ఆస్పత్రుల్లో చేరుతున్నారు. రోగులతో ఆస్పత్రులు కిటకిటలాడుతున్నాయి.



జ్వరాలతో బాధపడుతూ ఆస్పత్రిలో చేరిన బాధితులు

కంపుకొడుతున్న డ్రెయినేజీలు

ఎల్లారెడ్డిపేట మండలంలోని 24 గ్రామ పంచాయతీల్లో కార్మికుల సమ్మె కారణంగా పారిశుధ్యం అస్తవ్యస్తంగా మారింది. ప్రధానంగా మురుగు నీటి కాలువలు కంపుకొడుతూ, దోమలు వృద్ధి చెంది రోగాల బారిన పడుతున్నారు. ప్రధానంగా మురుగు నీటి కాలువలు మాత్రం అస్తవ్యస్తంగా మారి రోడ్ల వెంట, జనావాసాల మధ్య మురుగు నీరు ప్రవహిస్తోంది. దశాబ్దాల కాలంగా మురుగు నీటి కాలువల నిర్మాణ పనులు చేపట్టడంలో అటు పాలకులు, ఇటు అధికారులు విఫలమవుతున్నారు. ఫలితంగా ప్రజలు దోమల బారిన పడి మురుగు కంపుతో అనారోగ్యం పాలై ఆస్పత్రిల్లో చేరి ఆర్థిక, ప్రాణనష్టాలకు గురవుతున్నారు. గ్రామంలో వీధులన్నీ సీసీలు మార్చినప్పటికీ కేవలం మురుగు నీటి కాలువలను మాత్రం అభివృద్ధి చేయకపోవడం విచారకరం.



జనావాసాల్లోంచి పారుతున్న మురుగు నీరు

- ఎల్లారెడ్డిపేట మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని 2, 3, 6, 14వ వార్డుల్లో మురుగు నీటి కాలువలు అస్తవ్యస్తంగా మారాయి.
- మిగతా గ్రామాల్లో మురుగు నీటితో దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పలుసార్లు గ్రామసభల్లో ఫిర్యాదులు చేసినప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు.
- డ్రెయినేజీ కాలువల నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు మంజూరు చేసినప్పటికీ వాటిని వేరే పనులకు మళ్లించి మురుగు కాలువ మరమ్మతు పనులను మూలకు వేస్తున్నారు.
- మురుగు నీటి కాలువల్లో మట్టి కూరుకుపోయి మురుగు నీరు ఇళ్లలోకి వస్తోంది.
- కార్మికుల సమ్మెతో వీధుల్లో చెత్త పేరుకుపోతోంది. చెత్తను తొలగించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవడం లేదు.
- మురుగునీరు, పేరుకుపోతున్న చెత్తతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. అనారోగ్యాలతో ఆస్పత్రుల్లో చేరుతున్నారు.
- ప్రభుత్వపరంగా వైద్యం అందక ప్రైవేట్ ఆస్పత్రుల్లో ఖర్చులు చేస్తూ ఇబ్బందులు పడుతున్నారు.

పట్టించుకోవడం లేదు



గ్రామాల్లో మురుగు నీటి కాలువలు అస్తవ్యస్తంగా ఉన్నట్లు ప్రజలు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకుపోయిన పట్టించుకోవడం లేదు. గ్రామసభల్లో అనేకసార్లు మురుగు నీటి కాలువలపై ఫిర్యాదులు చేశాం. ఎల్లారెడ్డిపేట రెండవ బైపాస్‌లో జంక్షన్ వద్ద కొత్తగా మురుగు నీటి కాలువల నిర్మాణం చేయాల్సి ఉంది. ప్రత్యేక నిధులు కేటాయించి పనులు చేపట్టాలి. – దానియాల్, ఎల్లారెడ్డిపేట

రోగాల బారిన పడుతున్నం



కార్మికుల సమ్మెతో నిత్యం చెత్తను సేకరించకపోవడంతో రోగాల పాలవుతున్నాం. డ్రెయినేజీల్లో మురుగుతో నిండి కంపుకొడుతున్నాయి. అధికారులు పట్టించుకోవడం మానివేశారు. ప్రత్యామ్నాయంగా కార్మికులను ఏర్పాటు చేసి చెత్తను తొలగించాలి. మురుగు నీటి కాలువలు శుభ్రం చేయాలి. లేకుంటే పరిస్థితి చేయిదాటిపోతుంది. – కుర్ర బాలమణి, ఎల్లారెడ్డిపేట

చర్యలు తీసుకుంటాం



కొన్ని గ్రామాల్లో మురుగు నీటి సమస్య ఉందనేది వాస్తవమే. పంచాయతీ కార్మికులు సమ్మె చేస్తుండడంతో చెత్త సేకరణ, మురుగు నీటి కాలువలను శుభ్రం చేయడంలో జాప్యం జరుగుతోంది. ప్రైవేట్‌గా కార్మికులను పెట్టి చెత్త, మురుగు నీటి కాలువలను శుభ్రం చేస్తాం. మండలంలోని అన్ని గ్రామాల్లో మురుగు నీటి కాలువలను తొందరలోనే మరమ్మతు చేస్తాం. – చిరంజీవి, ఎంపీడీవో, ఎల్లారెడ్డిపేట

బో'నమో పోచమ్మ'





ఇల్లంతకుంట: మండల కేంద్రంలో మాల కులస్తులు ఆదివారం పోచమ్మ బోనాలు తీశారు. మహిళలు నెత్తిన బోనాలెత్తుకుని డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

చిత్రకథ



సీసీ రోడ్డును చీల్చుకుని ఎగజిమ్ముతున్న నీరు

సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణంలోని వెంకంపేట ప్రధాన రహదారిలో ఇటీవల కొత్తగా వేసిన సిమెంట్ రోడ్డును చీల్చుకుంటూ నీరు ఎగచిమ్ముతోంది. సీసీ రోడ్డు కింద వేసిన మిషన్ భగీరథ పైపులైన్ పగిలి నీరు ఇలా వృథా అవుతోంది. రోడ్డును తవ్వి పైపులైన్‌ను రిపేరు చేయాల్సిందే. రిపేరు చేయకుంటే నల్లానీరు నిత్యం వృథా అవడమే కాకుండా, సీసీ రోడ్డు పాడవుతుంది. ఇది మన సిరిసిల్ల కాంట్రాక్టర్ల పని తీరును నిదర్శనం.

పవర్ కట్

నేడు విద్యుత్ అంతరాయం

తంగళ్లపల్లి: మండలంలోని నేరెళ్ల విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు బస్వాపూర్, బాలమల్లుపల్లి, రామన్నపల్లి, రామాజీపేట, నర్సింహులపల్లె, నేరెళ్ల, సారంపల్లి, బెద్దనపల్లి గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని సెస్ ఏఈఈ స్రవంతి ఒక ప్రకటన ద్వారా తెలిపారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నియామకం

రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గం

వేములవాడరూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల కార్యవర్గం ఎన్నికలు వేములవాడలో ఆదివారం నిర్వహించారు. అధ్యక్షుడిగా టి.సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా సీహెచ్ సత్తయ్య, కోశాధికారిగా ఎస్.రాజేశం, ఉపాధ్యక్షులుగా సాంబశిరామ్, సత్తయ్య, జిల్లా సహాయ కార్యదర్శిగా సుధాకర్, సంయుక్త కార్యదర్శులుగా సత్యనారాయణ, దేవయ్య, శ్రీనివాస్, సంస్థాగత కార్యదర్శులుగా లక్ష్మయ్య, ఉమామహేశ్వరశర్మ, అసోసియేట్ అధ్యక్షుడుగా విఠల్ ఎన్నికయ్యారు.

బీఆర్ఎస్ గ్రామ బూత్ కమిటీ నియామకం

తంగళ్లపల్లి: మండలంలోని అంకుషాపూర్ గ్రామంలో బీఆర్ఎస్ ఇన్‌చార్జి బండి దేవదాస్ ఆధ్వర్యంలో బూత్ కమిటీని నియమించారు. 1వ బూత్ అధ్యక్షుడిగా జీల రాములు, 2వ బూత్ రేగుల రాజును నియమించారు. కార్యక్రమంలో నాయకులు అర్కుటి మహేశ్, కొత్త సంతోష్, సర్పంచ్ కొయ్యడ ఎల్లవ్వ, ఎంపీటీసీ కుంటయ్య పాల్గొన్నారు.

ఠాణా దివస్‌ను విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న ఏఎస్ఐ బాబు

బోయినపల్లి: బోయినపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఆగస్టు 1న ఎస్పీ అఖిల్ మహాజన్ నిర్వహించే ఠాణా దివస్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని పోలీసులు గ్రామాల్లో అవగాహన కల్పిస్తున్నారు. ఆదివారం స్థానిక బస్టాండ్ ప్రాంతంలో ఏఎస్సై బాబు ఠాణా దివస్ గూర్చి ప్రజలకు వివరించారు. పెండింగ్ సమస్యలు ఉన్న వారు ఠాణా దివస్‌లో పాల్గొనాలని కోరారు. గ్రామాల్లో దండోరా వేయడంతో పాటు గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో మైకుల ద్వారా ప్రచారం చేస్తున్నారు.

కేకేను విమర్శించే నైతికత సిరిసిల్ల కౌన్సిలర్లకు లేదు



మాట్లాడుతున్న జాలగం ప్రవీణ్

తంగళ్లపల్లి: కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే.మహేందర్‌రెడ్డిని విమర్శించే నైతికత సిరిసిల్ల మున్సిపాలిటీ కౌన్సిలర్లకు లేదని తంగళ్లపల్లి కాంగ్రెస్ అధ్యక్షుడు జాలగం ప్రవీణ్(టోని) అన్నారు. మండల కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ మూడు శాతం కమీషన్లు తీసుకోమని మంత్రి కేటీఆర్ చెప్పాడని చెప్పిన మీరా..? కేకేను విమర్శించేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేకేను వలస పక్షిగా పేర్కొంటే కేటీఆర్ వలుస రాబందా? అని ప్రశ్నించారు. దోపిడే లక్ష్యంగా పరిపాలన సాగిస్తున్న మీరు కేకేను విమర్శించడం సిగ్గుచేటని మండిపడ్డారు. నాలుగు ఏళ్లుగా చిన్నపాటి వర్షాలకే కాలనీలు మునిగిపోతున్నాయని ఎద్దేవా చేశారు. కేకే ప్రజల మనిషని మరోసారి ఆయనపై అవాక్కులు చెవాక్కులు పేలితే సహించేది లేదని హెచ్చరించారు.

కొనసాగుతున్న పంచాయతీ కార్మికుల సమ్మె



కోనరావుపేట: రాస్తారోకో చేస్తున్న కార్మికులు



చందుర్తిలో రాస్తారోకో



ముస్తాబాద్‌లో కార్మికుల ర్యాలీ



వీర్నపల్లిలో అంబేద్కర్ విగ్రహం వద్ద..

వేములవాడ: పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారంతో 25వ రోజుకు చేరుకుంది. వేములవాడ పట్టణంలోని తెలంగాణ చౌక్‌లో చేపట్టిన సమ్మెకు సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ముక్తికాంత అశోక్ ఆదివారం సంఘీభావం ప్రకటించారు.
కోనరావుపేట: కోనరావుపేట క్రాసింగ్ వద్ద సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎగమంటి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు.
ముస్తాబాద్: ముస్తాబాద్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆదివారం పంచాయతీ కార్మికుల శాంతియుత ర్యాలీని చేపట్టారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు జల్లి లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర రాకేశ్, పాల్గొన్నారు.
వీర్నపల్లి: మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద రాస్తారోకో నిర్వహించారు. గ్రామ పంచాయతీ కార్మికుల అధ్యక్షుడు లద్దురి నర్సయ్య మాట్లాడారు.
చందుర్తి: మండల కేంద్రంలో వేములవాడ–కోరుట్ల ప్రధాన రహదారిపై గ్రామపంచాయతీ కార్మికులు ధర్నా, రాస్తారోకోను చేపట్టారు. కార్యక్రమంలో చందుర్తి, రుద్రంగి మండలాల కార్మికులు పాల్గొన్నారు.

ఖాళీ స్థలాల్లో వరద నీరు



వేములవాడ: అంటు వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు జిల్లా అధికార యంత్రాంగం గట్టి పట్టుదలతో ముందుకుసాగుతున్న తరుణంలో వేములవాడ పట్టణంలోని బైపాస్ రోడ్డును ఆనుకుని ఉన్న అనేక ఖాళీ స్థలాల్లో ఇంకా వర్షపు నీరు నిలిచే ఉంది. దీంతో దోమలు పెరిగిపోవడమే కాకుండా అపరిశుభ్రత రాజ్యమేలుతుంది.

రెండు రోజుల్లో బూత్ కమిటీలు

ముస్తాబాద్: నామినేటెడ్, పార్టీ పదవుల్లో ప్రాధాన్యత కల్పించాలని ముస్తాబాద్ పట్టణ బీఆర్ఎస్ నాయకులు పక్షం రోజులుగా కోరుతున్నారు. ఈమేరకు ముస్తాబాద్‌లో ఆదివారం బీఆర్ఎస్ నాయకులు యాదవ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఆగస్టు 2న బీఆర్ఎస్ పట్టణ బూత్ కమిటీలను వేస్తామని తీర్మానించారు. రెండు రోజుల క్రితం మండల బీఆర్ఎస్ ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు సమావేశం నిర్వహించి, పట్టణ నాయకుల అలకపై చర్చించారు. తెలంగాణ ఉద్యమకారులకు, సీనియర్లకు, పనిచేసిన వారికి గుర్తింపును ఇవ్వాలని పట్టణ నాయకులు చేసిన విజ్ఞప్తిపై మాట్లాడారు. దీనిపై సమావేశం నిర్వహించిన పట్టణ నాయకులు బూత్ కమిటీలు వేసిన అనంతరం మంత్రి కేటీఆర్‌ను కలిసి తమ సమస్యలు చెప్పుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పటికే బూత్ కమిటీల నియామకం ఆలస్యం కాగా, పట్టణానికి చెందిన 70 మంది సీనియర్లు, ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు ఒక్కతాటిపై ఉండడంపై మంత్రి కేటీఆర్ సైతం ఆరా తీసినట్లు తెలిసింది. ఇన్నాళ్లు రాని సమస్య ఇప్పుడే ఎందుకు ఉత్పన్నమైందని సీనియర్ నాయకులను అడిగినట్లు సమాచారం. అయితే ముస్తాబాద్‌కు చెందిన 70 మంది ఐక్యతతో ఉంటూ ఎవరికి ఆపద, కష్టం వచ్చిన అండగా నిలిచేందుకు ప్రతి నెల నగదు జమచేస్తున్నారు.

రోడ్లకు మరమ్మతు చేయాలి


చందుర్తి: భారీ వర్షాలకు మండలంలోని పలు గ్రామాల్లోని కొట్టుకుపోయిన రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని చందుర్తి జెడ్పీటీసీ నాగం కుమార్ డిమాండ్ చేశారు. మండలంలోని ఎన్గల్, సనుగుల, బండపల్లి, జోగాపూర్, లింగంపేట గ్రామాల్లోని రోడ్లు కోతకు గురయ్యాయి. ఐదు రోజులుగా ప్రజలు రాకపోకలు నిలిచి పోయి ఇబ్బంది పడుతున్నారు. కోతకు గురైనా రోడ్లను ఎమ్మెల్యే పరిశీలించి మూడు రోజులు గడుస్తున్నా పనులు మాత్రం చేయించడంలో విఫలమయ్యారని ఆరోపించారు. మరమ్మతు చేయించకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో జోగాపూర్ ఎంపీటీసీ మ్యాకల గణేశ్, ఎన్గల్ మాజీ ఉపసర్పంచ్ గసికంటి ప్రభాకర్, నాయకులు సంతుపూరి బాలకృష్ణారెడ్డి, ధర్మపురి శ్రీనివాస్, మల్లేశం పాల్గొన్నారు.

వృద్ధురాలికి అండగా..



చందుర్తి: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఇళ్లు కూలి దయనీయస్థితిలో ఉన్న చందుర్తికి చెందిన నక్క పోశవ్వకు మన ఆపద్బాంధువుల ఫౌండేషన్ సభ్యులు అండగా నిలిచారు. ఈ విషయం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు వృద్ధురాలుకు 25 కిలోల బియ్యంతో పాటు 12 రకాల నిత్యావసర సరుకుల అందజేశారు. ఫౌండేషన్ సభ్యులు వనపర్తి సతీశ్, బోరగాయ తిరుపతి, ఉపసర్పంచ్ చిర్రం తిరుపతి, నాయకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



చెక్కులు అందజేస్తున్న నాయకులు

ముస్తాబాద్: మండలంలోని గూడెంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను పలువురు బాధిత కుటుంబాలకు నాయకులు ఆదివారం అందజేశారు. బొప్ప సత్తవ్వకు రూ.35 వేలు, కిరణ్‌కు రూ.12 వేలు, అంజవ్వకు రూ.25 వేలు, స్రవంతికి రూ.48వే లు, బండ బాలమణికి రూ.22 వేల విలువైన చెక్కులను అందించారు. ఉపసర్పంచ్ శాడ శ్రీనివాస్, సెస్ మాజీ డైరెక్టర్ కొమ్ము బాలయ్య పాల్గొన్నారు.

జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడిపై కేసు ఎత్తివేయాలి

ఇల్లంతకుంట: రాజన్న సిరిసిల్ల జిల్లా గౌడ సంఘం అధ్యక్షుడు చిదుగు గోవర్ధన్‌పై అక్రమంగా పెట్టిన కేసును ఎత్తివేయాలని గౌడ సంఘం మండల కన్వీనర్ గజ్జెల రాజశేఖర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజలకు ఆయన చేస్తున్న సహాయ కార్యక్రమాలు చూడలేకనే ఓర్వలేక అక్రమంగా కేసులు పెట్టారని, రాజకీయంగా ఎదుగుతున్న గోవర్ధన్ గౌడ్‌ను అణగదొక్కాలని అక్రమ కేసు పెట్టారని, పోలీసులు కేసు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు.

ముందస్తు చర్యలు



వేములవాడరూరల్: ఇటీవల కురిసిన వర్షాలతో గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. ఇందులో భాగంగా అన్ని గ్రామాల్లో రెవెన్యూ, మండల అధికారులు ముందస్తు చర్యల్లో భాగంగా విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు చేపడుతున్నారు. ఎంపీడీవో రాంరెడ్డి ప్రత్యేకంగా గ్రామాల్లో పర్యటించి వ్యాధుల నివారణ కోసం పంచాయతీ సిబ్బందిచే దోమల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు.

గొర్రెలు పంపిణీ

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధి 12వ వార్డు చంద్రంపేటలో ఆదివారం తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గొల్ల కుర్మలకు గొర్రెల పంపిణీలో భాగంగా లబ్ధిదారులకు కౌన్సిలర్ పాతూరి రాజిరెడ్డి గొర్రెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరగోని శ్రీనివాస్‌గౌడ్, అనవేణి పర్శరాములు, కోలపురం నర్సయ్య, రాయం పర్శరాములు, మల్లేశం, అనవేణి భూమయ్య, రాములు, మహిపాల్, ప్రశాంత్ పాల్గొన్నారు.

రైతులకు అవగాహన సదస్సు

తంగళ్లపల్లి: మండలంలోని నర్సింహులపల్లె గ్రామంలో బాబు జగ్జీవన్‌రామ్ వ్యవసాయ కళాశాల ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కోఆర్డినేటర్ కె.భవ్యశ్రీ రైతులకు హైడ్రోపోనిక్స్ సాగు విధానం గురించి తెలిపారు.